## కథ

# ఉషోదయం

జి.మేరీ కృపాబాయి

న్యూస్ పేపర్ చూడాలని చేతిలోకి తీసుకున్నదేగానీ, ఆమె ఆలోచనలన్నీ భర్త వైపు మళ్లాయి. భర్త తనను అపురూపంగా చూసుకొనే తీరు ఆమెకు స్మరణకు వచ్చింది.

"సింధూ! అస్తమానూ ఎందుకు అలా పనిచేస్తూ ఉంటావు? కాసేపు విశ్రాంతి తీసుకోకూడదూ?"

"సింధూ! ఈరోజు అస్సలు ఫ్రూట్‌జ్యూస్ తీసుకోలేదు కదూ! అలా అయితే ఎలా చెప్పు. ఆరోగ్యం పాడవదూ?"

"సింధూ! నీ కిష్టమని నేతిహల్వా తీసుకువచ్చాను."

ఆలోచనలలో నిమగ్నమైన సింధూర ల్యాండ్ ఫోన్ శబ్దానికి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వడివడిగా వెళ్లి ఫోన్ రిసీవ్ చేసుకుంది.

''హలో సింధూ! నేను కరుణ్‌ని మాట్లాడుతున్నాను. నా ఫ్రెండ్ ఈశ్వర్ ఏదో ఇంటర్వ్యూ పనిమీద హైదరాబాద్ వచ్చాడట. ఇప్పుడే ఫోన్ చేసి చెప్పాడు. ఒక గంటలో మనింటికి వస్తాడు. అతనికి కూడా లంచ్ ఏర్పాటు చెయ్యి" అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసాడు కరుణ్.

"తన భర్త కరుణ్ తనను ఎంతో ప్రేమగా చూసుకుంటాడు. మాటలతోగాని, చేతలతోగానీ తననెప్పుడూ హర్ట్ చెయ్యడు 'ఎంతో విశాల హృదయం కలిగి ఉంటాడు. మంచి హ్యూమన్ రిలేషన్స్ మెయిన్‌టెయిన్ చేస్తాడు. అందరితోనూ ఆప్యాయంగా మాట్లాడుతాడు. మచ్చుకైనా మచ్చలేనివాడు. అవినీతి, లంచగొండితనాన్ని అసహ్యించుకుంటాడు. ఇన్ని మంచి లక్షణాలున్న తన భర్త తన నుండి కట్నం కోరాడు. తన తండ్రి ఒక ప్రైవేట్ కంపెనీలో గుమాస్తా ఎంతో కష్టపడి, ఎన్నో అప్పులు చేసి రెండు లక్షల కట్నం ముట్టచెప్పాడు.

కట్నం తీసుకున్న తన భర్తను తను మనస్ఫూర్తిగా ప్రేమించలేకపోతోంది. తమ అనురాగపు సంసార సాగరంలో తన భర్త తీసుకున్న కట్నం సుడిగుండంలా అన్పిస్తోంది. తన భర్త నుండి ప్రేమామృతాన్ని పొందేవేళ గరళంలా ఆ సంఘటన అడ్డుపడుతోంది." అనుకుంటూ వంటింటివైపు నడిచింది సింధూర.

భర్త మనస్తత్వాన్ని అంచనా వేసుకుంటూ వంటపూర్తి చేసింది సింధూర. అలా వంట పూర్తి చేసిందో లేదో ఇలా కాలింగ్ బెల్ మ్రోగింది. ఆ వచ్చింది గెస్ట్ అయి ఉంటుంది.'' అనుకుంటూ డోర్ తెరిచింది సింధూర ఎదురుగా ఓ అపరిచిత వ్యక్తి. అతనే ఈశ్వర్ అని గ్రహించింది సింధూర "మీరు ఈశ్వర్ కదూ!" చిరునవ్వుతో ప్రశ్నించింది.

"అవునండీ! మీరు కరుణ్ వైఫ్ సింధూర కదూ!"

"అవును నా పేరు మీకెలా తెలిసింది?" ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది సింధూర.

''ఎప్పుడు ఫోన్ చేసినా కరుణ్ మీ గురించే చెబుతాడు. మిమ్మల్ని ఆకాశానికెత్తేస్తూ ఉంటాడు. అతని సామ్రాజ్యంలో మీరొక మహారాణి." నవ్వుతూ అన్నాడు ఈశ్వర్.

''అరె మిమ్మల్ని నిలబెట్టి మాట్లాడుతున్నాను. అలా సోఫాలో కూర్చోండి." అంటూ అతనికి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది సింధూర. రెండు నిముషాలు ఇల్లు పరిశీలనగా చూసాడు ఈశ్వర్.

''పెద్దగా ఆర్భాటంగా లేకుండా సాదాసీదాగా పరిశుభ్రంగా ఉంది. ఇల్లంతా చక్కగా సర్ది ఉంది." అనుకున్నాడు.

"కరుణ్ మీకు భర్తగా రావడం మీ అదృష్టం." సూటిగా చెప్పేసాడు ఈశ్వర్.

"నేను కరుణ్‌కి భార్యగా రావడం కరుణ్ అదృష్టం కాదా." చిరునవ్వుతోనే అంది సింధూర.

"అలా అని కాదు సింధూర గారూ! మిమ్మల్ని చేపట్టడం కరుణ్ అదృష్టం అయితే కావచ్చుకానీ కరుణ్ అంత మంచివాడు నాకు తెలిసినంతవరకూ ఎవరూ ఉండరు. వాడు నాకు చిన్నప్పటి నుండీ తెలును. ఒక చిన్న బ్యాడ్ హేబిట్ కూడా లేదు. ఈనాటి కుర్రకారంతా ఏవేవో వ్యసనాలకు బానిసలవుతూ ఉంటే కరుణ్ మాత్రం వాటికి వేలమైళ్ల దూరంలో ఉంటాడు. ప్రతి విషయంలోనూ నిజాయితీగా ఉంటాడు. కష్టపడి గవర్నమెంట్ జాబ్ సంపాదించాడు. పైసా కట్నం తీసుకోకుండా

మిమ్మల్ని పెళ్లి చేసుకుని ఉంటాడు. కట్నం తీసుకునే మగాళ్లంటే వాడికి అసహ్యం. కట్నం తీసుకోకుండా పెళ్లి చేసుకుంటానని నాతో చాలా సార్లు చెప్పాడు. కట్నం తీసుకునే వాడికి స్వంత వ్యక్తిత్వం ఉండదని ఎప్పుడూ వాదించేవాడు" అన్నాడు ఈశ్వర్.

ఈశ్వర్ మాటలకు ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది సింధూర.

"కరుణ్‌ది ఎంత నటన! పైన ఒకరకం. లోన మరొకరకం. నలుగురిలో ఉన్నప్పుడు వ్యక్తం చేస్తున్న భావాలు ఒకరకం. మనసులోని భావాలు మరొకరకం. పేదరికంలో మగ్గిపోతున్న తన దగ్గరనుండి రెండు లక్షల కట్నం వసూలు చేసి, పైకి నీతిగా నిజాయితీగా కన్పించాలని ప్రయత్నించడం. ఇటువంటి మేకవన్నెపులులతో జీవితాన్ని పంచుకోవటమంత దురదృష్టం మరొకటుండదు." మనసులోనే అనుకుంది సింధూర.

ఇంతలనో సింధూర అత్తగారు అక్కడికి వచ్చింది. ఈశ్వర్ ఆమెను గుర్తు పట్టాడు.

"ఆంటీ బావున్నారా? అన్నట్లు, బిందుకి హార్ట్ ప్రాబ్లమ్ వచ్చి ఈమధ్యనే హార్ట్ ఆపరేషన్ జరిగిందటగా!" కరుణ్ చెల్లెలి గురించి అడిగాడు ఈశ్వర్.

"అవును బాబూ! బిందు చిన్నప్పటినుండీ అనారోగ్యంగానే ఉండేది. ఆ విషయం నీకూ తెలుసు. ఈమధ్య గుండెజబ్బు కూడా వచ్చింది. పరిస్థితి విషమించడంతో హార్ట్ ఆపరేషన్ చెయ్యాల్సి వచ్చింది. నీరసంగా ఉందంటూ ఇప్పుడే అలా బెడ్‌రూంలోనికి వెళ్లింది." చెప్పింది జానకి!

"సరే! ఆమెను రెస్ట్ తీసుకోనివ్వండి. కరుణ్ వచ్చిన తర్వాత పలకరిస్తాను." అన్నాడు ఈశ్వర్.

జానకి, ఈశ్వర్ కబుర్లలో పడ్డారు. సింధూర ఏవేవో ఆలోచనలలో నిమగ్నమైపోయింది.

అరగంట తర్వాత కరుణ్ ఆఫీసు నుండి వచ్చాడు. వచ్చీ రావడంతోనే ఈశ్వర్‌ని ఆప్యాయంగా పలకరించాడు.

"కరుణ్! నీ జాబ్ ఎలా ఉంది? మీ ఆఫీసర్ మంచివాడేనా?" అడిగాడు ఈశ్వర్.

"ఈశ్వర్! మా ఆఫీసర్ చాలా మంచివాడు. నన్ను ఒక క్లర్కులా కాకుండా తన కొలీగ్‌లానే చూస్తాడు." అంటూ తన ఆఫీస్ విశేషాలు వివరించాడు కరుణ్!

మరో పది నిమిషాల తర్వాత అందరూ లంచ్‌కి ఉపక్రమించారు. ఈశ్వర్ బిందుని మనసారా పలకరించాడు. చిన్న వయసులో ఆమెకు హార్ట్ ఆపరేషన్ అయినందుకు చాలా బాధపడ్డాడు. ఆరోజు సాయంత్రం ఈశ్వర్ వెళ్లిపోయాడు.

ఈశ్వర్ వచ్చివెళ్లిన దగ్గరనుండే, సింధూర కరుణ్‌తో ఫ్రీగా ఉండలేకపోతోంది. ఆఫీస్ వర్క్‌తో బిజీగా ఉన్న కరుణ్ సింధూర మనస్తాపాన్ని గ్రహించలేకపోయాడు.

ఆరోజు సింధూరకు విపరీతంగా జ్వరం వచ్చింది. సింధూర లేవలేని పరిస్థితిలో నిస్సహాయంగా బెడ్‌పై వాలిపోయింది. సింధూరను గమనించాడు కరుణ్.

"సింధూ! ఏమిటి అలా ఉన్నావే? ఒంట్లో బావుండలేదా?" అంటూ ఆమె నుదుటిపై చేయివేసాడు. ఆమె నుదురు సలసలా కాలిపోతోంది.

"సింధూ! ఏమిటి జ్వరం ఎందుకు వచ్చింది?" బాధపడిపోతూ అడిగాడు కరుణ్!

"జ్వరం ఎందుకు వచ్చిందో నాకెలా తెలుస్తుంది! నేనేమైనా డాక్టర్‌నా?" అంత నీరసంలోనూ చిరాగ్గా మాట్లాడింది సింధూర.

"సింధూ ఎందుకలా మాట్లాడుతున్నావ్? నామీద కోపమా? ఎందుకలా?" ఆశ్చర్యంగా అన్నాడు కరుణ్

సింధూర మౌనంగా ఉండిపోయింది. కరుణ్ వెంటనే ఆఫీసుకి లీవుపెట్టి భార్యను హాస్పటల్‌కు తీసుకువెళ్లాడు. ఆమెకు ఏమవుతుందోనని భయంతో వణికిపోయాడు. ఫ్యామిలీ డాక్టర్ దగ్గర ట్రీట్‌మెంట్ ఇప్పించి ఇంటికి తీసుకువచ్చాడు. దగ్గరుండి సపర్యలు చేసాడు. రెండు రోజులలో సింధూర జ్వరం తగ్గుముఖం పట్టింది. ఆమెకు పూర్తిగా తగ్గిన తర్వాత అతను డ్యూటీకి వెళ్లాడు.

అతని ఆప్యాయత, అనురాగం ఆమెకు అర్థం కాలేదు.

కరుణ్ నిజాయితీకి మారుపేరు కాదు. కట్నం తీసుకోవడం తనకు ఇష్టం లేదని స్నేహితులతో చెప్పి గుట్టుచప్పుడు కాకుండా తన దగ్గర కట్నం తీసుకున్నాడు. అంటే అతని బుద్ధిలో లోపం ఉన్నట్లే. తనను పోషిస్తున్నందుకు లంచం తీసుకున్నట్లే తన ఎడల తను చూపుతున్న అనురాగం, ప్రేమ నిజం కాదు." మనసులోనే అనుకుంది సింధూర.

* * * * *

ఆ రోజు మూడుగంటల కల్లా ఇంటికి వచ్చేసాడు కరుణ్! రావడం రావడమే కిచెన్‌లో ఉన్న సింధూర దగ్గరకు వచ్చేసాడు.

"సింధూ! నువ్వు త్వరగా రడీ అవ్వు. అర్జంటుగా మీ ఇంటికి వెళ్లాలి." అన్నాడు కరుణ్!

కంగారు పడిపోయింది సింధూర!

"ఏమయిందండీ! అమ్మకు గానీ, నాన్నకు గానీ బావుండలేదా?" వణికిపోతూ అడిగాంది.

ఛ... ఛ... అలాటిదేమీ లేదు. సరదాగా వెళదామంటున్నాను. నువ్వు అనవసరంగా కంగారు పడకు. అక్కడ ఏమీ జరగలేదు" అన్నాడు కరుణ్ ప్రేమగా ఆమెను దగ్గరకు తీసుకుంటూ.



**'ఆకుల కదలికలు'** ఆవిష్కరణ సభలో (కుడి నుండి ఎడమకి) చల్లగాలి బాబూరావు, నర్రావుల వెంకటరమణ, గుడిమెట్ల చెన్నయ్య, ఉప్పలధడియం వెంకటేశ్వర తదితరులు పాల్గొన్నారు.

అరగంటలో సింధూర తయారైంది. ఇద్దరూ విజయవాడ బయలుదేరారు. బస్సులో ప్రయాణిస్తున్న సింధూర మనసులో ఏవేవో ఆలోచనలు!

ఇంత అర్జంటుగా ప్రయాణమేమిటి? బహుశా తను ఇచ్చిన కట్నం చాలలేదేమో! ఇంకా కట్నం డిమాండ్ చేస్తాడేమో! మరో రెండు లక్షలు తెచ్చేవరకూ పుట్టింట్లోనే ఉండమంటాడేమో!" రకరాల ఆలోచనలతో ఆమె తలవేడెక్కి పోతోంది.

ఆలోచనల తరంగాల అంతరంగాన్ని కలచివేస్తూండగానే విజయవాడ వచ్చేసింది. బస్టాండ్ నుండి ఇల్లు చేరేసరికి అరగంట పట్టింది. సింధూర తల్లి తండ్రి, కూతురిని, అల్లుడిని సాదరంగా ఆహ్వానించారు. ఫ్రెషప్ అయి కాసేపు సేదతీరారు. వేడివేడి పకోడి, చిక్కటి టీ ఇచ్చి సింధూర తల్లి తన ఆప్యాయతను కొలిచి చూపించింది. సింధూర తండ్రి వారిరువురితో ఏవేవో కబుర్లు చెబుతూ ఆనందపడిపోసాగాడు. కరుణ్ మామగారు చెప్పిన ప్రతి విషయాన్ని శ్రద్ధగా ఆలకించసాగాడు.

మరి కాసేపు తర్వాత కరుణ్ తనువచ్చిన అసలు విషయాన్ని బయట పెట్టాడు.

అత్తయ్యా! నేను మీదగ్గర రెండు లక్షలు కట్నంగా తీసుకున్నాను. ఆ విషయంలో నేను చాలా బాధపడుతున్నాను." అన్నాడు కరుణ్ ఆవేదనతో. "దానిదేముందిలే బాబూ! ఈ రోజులలో అది సహజమే కదా! నువ్వు ఏటికి ఎదురీదలేవుకదా!" అంది సింధూర తల్లి సావిత్రి.

లేదు అత్తయ్యా! జీవిత భాగస్వామిని ఆహ్వానించేవేళ, అటువంటి నీచపు పని చెయ్యడం చాలా తప్పు. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో నేను ఆ రెండు లక్షలూ తీసుకోవలసి వచ్చింది."

"పర్లేదులే బాబూ! ఇప్పుడా విషయాలన్నీ ఎందుకు?" అన్నాడు సింధూర తండ్రి మాధవరావు.

"మామయ్యా! నా చెల్లెలు బిందుకి గుండె ఆపరేషన్ చేయించడానికి డబ్బులేక ఎంతో మందిని అప్పు అడిగాను. కానీ అప్పు దొరకలేదు. సమయానికి ఆపరేషన్ చెయ్యకపోతే బిందు బ్రతకదని డాక్టర్లు తేల్చి చెప్పేసారు. సరిగ్గా అదే సమయంలో మీ సంబంధం వచ్చింది. సింధు నాకు బాగా నచ్చింది. కట్నం తీసుకోవడానికి వ్యతిరేకినైన నాకు కట్నం తీసుకుని చెల్లెలికి ఆపరేషన్ చెయ్యించాలనే మెరుపులాటి దారి కన్పించింది. వెంటనే ఏమీ ఆలోచించకుండా మీనుండి రెండు లక్షలు తీసుకుని బిందుకి ఆపరేషన్ చెయ్యించి, మరో నెలరోజుల తర్వాత సింధూరను చేపట్టారు. కానీ నా మనసులో ఏదో గిల్టీ ఫీలింగ్. దానిని బయటకు కన్పించనీయక జాగ్రత్త పడ్డాను. ఎలాగైనా సరే ఆ రెండు లక్షలూ తిరిగి మీకు ఇచ్చెయ్యాలని అప్పటినుండి విశ్వప్రయత్నం చేస్తున్నాను. అంతకుముందు తీసుకున్న పర్సనల్‌లోన్ తీరడానికి ఇంకా గడువుందని గ్రహించాను. అది పూర్తయినవెంటనే మళ్లా లోన్ తీసి మీ రెండు లక్షలూ మీకు తిరిగి ఇచ్చి వెయ్యాలని దృఢ నిశ్చయానికి వచ్చాను. పోయిన నెలలో పాతలోన్ తీరిపోయింది..." అంటూ ఆగాడు కిరణ్

సింధూర కరుణ్ వైపు ఆశ్చర్యంగా చూస్తోంది. విషయమేమిటో ఆమెకు అర్థం కావడం లేదు. సావిత్రి, మాధవరావు కూడా అతను చెప్పేది వింటూ అయోమయంలో పడిపోయారు. అతను తను చెప్పదలచుకున్న విషయం కొనసాగించాడు.

"పాత లోన్ తీరిపోయిన వెంటనే మళ్లా లోన్‌కి అప్లై చేసాను. వారం రోజులలో రెండు లక్షలు లోన్ వచ్చింది. ఈరోజే లోన్ తీసుకున్నాను. నేను తీసుకున్న కట్నం తిరిగి ఇచ్చేస్తున్నాను." అంటూ తన బ్రీఫ్‌కేస్‌లో భద్రంగా దాచిన రెండు లక్షలూ తీసి మాధవరావు గారి చేతిలో పెట్టాడు కరుణ్.

ఆనందంతో సింధూర కళ్లు ఆనంద బాష్పాలను వర్షించాయి. ఆరాధనా పూర్వకంగా భర్తనే చూస్తోంది సింధూర. అతనిని అపార్థం చేసుకున్నందుకు పశ్చాత్తాప పడసాగింది. ఇక సావిత్రి, మాధవరావు పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. వారి సంతోసానికి అవధులే లేకపోయాయి.

"బాబూ! ఇంత మంది కట్నం తీసుకుని పెళ్లిళ్లు చేసుకున్నవారిని గతంలో చూసాను గానీ, నీలా కట్నం తిరిగి ఇచ్చేసిన వాడిని, కట్నం తీసుకున్నందుకు పరితాపం చెందిన వాడిని నేను ఎప్పుడూ చూడలేదు. నా కూతురు నిజంగా అదృష్టవంతురాలు." ఆనందంతో మాధవరావు గొంతు పులకించిపోయింది.

"బాబూ! ఏ పరిస్థితుల్లో నువ్వు కట్నం తీసుకున్నదీ వివరించి చెప్పావు. నీ పరిస్థితి మేము అర్థం చేసుకున్నాము. రెండు లక్షలూ తిరిగి ఇచ్చెయ్యాలనే నీ తపన. ఆ తపన వెనుక నీ విశాల హృదయం నా మనసును కదిలించి వేసింది. మా సింధూర అంత అదృష్టవంతురాలు ఈ లోకంలో మరెవ్వరూ ఉండరు. అంది సావిత్రి.

అలా కాదండీ! ఏ పరిస్థితులు ఎటువంటి ప్రభావాన్ని చూపించినా కట్నం తీసుకోవడం తప్పే. చేసిన తప్పును సరిదిద్దుకోవడం నా బాధ్యత. అస్తమించిన సూర్యుడు ఎంతో పరితాపం చెంది చిమ్మచీకట్లను తరమడానికి ఆ మరుసటిరోజు వేకువనే లేచి తూర్పుదారి గుండా రవి కిరణాలను జల్లుకుంటూపోయి చేసిన తప్పును దిద్దుకుంటాడు. ఉషోదయాన్ని తనివితీరా తిలకిస్తాడు. నేనూ అదే చేసాను." అన్నాడు కరుణ్.



ఫ్రీవర్స్ ఫ్రంట్ బహుమతి ప్రధానోత్సవ సభలో శీలా వీర్రాజు, శిఖామణి, ఎ.బి.కె.ప్రసాద్, కుందుర్తి సత్యమూర్తి, శివారెడ్డి, యాకూబ్, చింతా అప్పలనాయుడు, నాళేశ్వరం శంకరం, పి.సి.రాములు